క్లుప్తంగా

ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వేడుకలు

రఘునాథపాలెం: మండలంలోని దొనబండలో శనివారం శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీముత్యాలమ్మ, పోతురాజుస్వామి విగ్రహాలను సైతం ప్రతిష్ఠించి బొడ్రాయి వేశారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశాక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నృసింహుడికి అభిషేకం



పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణ మాసం సందర్భంగా నగరంలోని స్తంభాద్రి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి 17వ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి 108 కలశాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పల్లె దవాఖానాకు కుర్చీల వితరణ

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు అదే గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం 10 కుర్చీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుమ్మరి అంబేడ్కర్, నూతలపాటి వెంకటేశ్వర్లు, బారి విజయ్‌కుమార్, కె.అశోక్, డి.అక్కారావు, పి.అభిలాష్, ఎ.నాగయ్య, యాకూబ్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కామేపల్లి: కేరళలో వరద బాధితుల సహాయ నిధికి ముద్దులపల్లి సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యాన శనివారం విరాళాలను ఇంటింటికి తిరిగి సేకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుగ్గి కృష్ణ, అంబటి శ్రీనివాసరెడ్డి, ఆడప ఉపేందర్, రామనాథం, గుండా వెంకటరెడ్డి, రామాచారి, వెంకటాచారి, కుందురు వెంకటరెడ్డి, సకినాల శ్రీనివాస్, మేడా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆప్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో దివ్యాంగులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా మాట్లాడిన ఆమెపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే పార్టీ తరపున ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఎమ్మార్పీఎస్ నాయకులు యాతాకుల భాస్కర్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చిర్రా భిక్షం, రామకృష్ణ, నాగేశ్వరరావు, పుల్లయ్య, వీరన్న, సత్యనారాయణ, ప్రకాషం, బ్రహ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

ఖమ్మం లీగల్: ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ఎ.యుగంధర్ ఆధ్వర్యాన శనివారం సర్దార్‌పటేల్ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి డి.రాంప్రసాద్ ప్రారంభించారు. ఇందులో వరుణ్ నాయక్, గరిక సంపత్ టీంలు, ఎంప్లాయీస్ జడ్జి జట్టు, న్యాయవాదుల ప్రెసిడెంట్ జట్టు అనే టీంలు పోటీ పడగా.. వరుణ్‌నాయక్, జిల్లా జడ్జి జట్లు గెలుపొందాయి. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా తన్నీరు పాపయ్య, గద్దల దిలిప్, బి.శ్రీనివాసరావు, పబ్బతి రామబ్రహ్మం వ్యవహరించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	శివం భజే
సాయిరాం	తుఫాన్, సూపర్ డీలక్స్
ఆదిత్య	కమిటీ కుర్రోళ్లు
శ్రీనివాస	రాయన్
	సీఎన్ సినీ గెలాక్సీ: సింబా

- ఖమ్మంగాంధీచౌక్



మనం ఇతరులకు ఏదైనా చెప్పాలనుకుంటే ఆర్ట్(చిత్రాలు)ల ద్వారా సులభంగా, స్పష్టంగా చెప్పొచ్చు. ఎంతటి కష్టమైన అంశాన్ని అయినా.. ఆర్టిస్టులు తమ చిత్రాల ద్వారా అందంగా.. అర్థమయ్యేలా చిత్రీకరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మాటలతో చెప్పలేని అంశాన్ని సైతం ఆర్ట్‌ల ద్వారా తెలియజేస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగినా.. ఆర్టిస్టులకు ఆదరణ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం, భవిష్యత్ తరాలను ఆలోచింపజేసేలా గీస్తున్నారు. – ఖమ్మం సహకారనగర్

వావ్ అనిపించేలా..

ఆకట్టుకుంటున్న ఆర్ట్‌లు

- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ
- ఆలోచింపచేసేలా చిత్రాలు
- టెక్నాలజీ పెరిగినా తగ్గని ప్రాధాన్యత
- చిత్రాల ఆధారంగా ధరలు

సండే స్పెషల్



నగరంలోని ప్రధాన రహదారి వెంట ఓ ప్రహరీపై చిత్రాలు



ఇల్లెందు క్రాస్‌రోడ్ ప్రముఖుల చిత్రాలు



ఓ వెంచర్‌లో ఇలా..

పెరుగుతున్న ఆదరణ..

ప్రస్తుతం టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందింది. అయినా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాలు, పార్కులు, మందిరాలు తదితర వాటిల్లో సందర్భానుకూలంగా చిత్రాలు వేయించేందుకు ఆర్టిస్టులకు అప్పగిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ఆర్టిస్టులకు ఆదరణ తగ్గడం లేదనేది స్పష్టంగా అర్థమవుతోంది. తమ ప్రతిభను నలుగురికి తెలియజేసేలా కొందరు ఆర్టిస్టులు తమకు నచ్చిన చిత్రాలను గోడలపై గీస్తూ చూపిస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లో అధికంగా..

రద్దీ ప్రాంతాల్లో ప్రజలను ఆకర్షించేలా వివిధ రకాల చిత్రాలను గీయిస్తూ.. వావ్ అనించేలా చేస్తున్నారు. వీటిని చూసిన వారికి దాని ప్రాధాన్యతను తెలియజేయడంతో పాటు ఒక్కోసారి ఆలోచించేలా ఉంటున్నాయి. కొద్దిమంది వెంచర్ల నిర్వాహకులు ప్రహరీలకు వేయిస్తుండగా.. మరికొంత మంది తమ దుకాణాల వద్ద వారికి నచ్చిన చిత్రాలను గీయిస్తున్నారు. స్వాగతం–సుస్వాగతం చిత్రాలతో పాటు నాట్యం వేస్తున్నట్లుగా, కూరగాయలు, పండ్లు విక్రయాలు చేస్తున్నట్లుగా గీస్తున్నారు.

చిత్రాలను బట్టి ధరలు..

ఆర్టిస్టులు చేసే పనిని బట్టి ధర చెబుతుంటారు. ఎక్కువ మోతాదులో వారు వేసే ప్రాంతం, చిత్రాలను ఆధారంగా చేసుకొని నగదు తీసుకుంటామని చెబుతున్నారు. ఆర్ట్‌లపై ఆసక్తి ఉన్న వారు ఇళ్ల వద్ద సైతం వేయిస్తుంటారని పేర్కొంటున్నారు.

ఆసక్తి ఉన్న వారే గీయిస్తారు..



ఆర్ట్‌లపై ఆసక్తి ఉన్న వారు మాత్రమే ప్రధాన ప్రాంతాల్లో తమకు నచ్చిన చిత్రాలను గీయిస్తుంటారు. ఆర్ట్ అనేది ఒక కళ. నేను 1994వ సంవత్సరం నుంచి ఆర్టిస్టుగా ఈ వృత్తిలో కొనసాగుతున్నాను. ఎంతో సంతోషంగా అన్పిస్తుంది. ఖమ్మం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో సైతం వెళ్తుంటాను.

– బీఆర్ నాగరాజు, ఆర్టిస్ట్, ఖమ్మం

ఆలోచింపజేసేలా ఆర్ట్‌లు..

నగరంలో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పరంగా పలు ప్రాంతాల్లో చిత్రాలు గీయిస్తున్నారు. ఈక్రమంలో కలెక్టరేట్‌లో పల్లె సంప్రదాయం, రైతాంగం చేస్తున్న కార్యక్రమాలను గీసినవి ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా ప్రధాన సెంటర్లలో పలువురి ప్రముఖుల చిత్రాలు, పాఠశాలల సమీపాన విద్యార్థులకు సంబంధించి, స్టేడియంకు సమీపాన క్రీడాకారులకు సంబంధించినవి వేయించారు. ఇలాంటి చిత్రాలు ప్రస్తుతం, భవిష్యత్ తరాలను ఆలోచింపజేసేలా ఉంటాయని పలువురు చెబుతున్నారు.



కలెక్టరేట్ ఆవరణలో గ్రామీణ చిత్రాలు

విద్యుత్ శాఖ ఆధ్వర్యాన పొలంబాట



రఘునాథపాలెం: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



నేలకొండపల్లిలో..

రఘునాథపాలెం/నేలకొండపల్లి: విద్యుత్ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన పొలంబాట కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ సెక్షన్ పరిధిలో గల దొనబండ, ఈర్లపూడి గ్రామాల్లో, నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో శనివారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మోటార్ల వద్ద కెపాసిటర్ల వాడకం, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే విద్యుత్‌పై జాగ్రత్తలు పాటించాలని, ఆటో స్టార్టర్లను తీసివేయాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా.. వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఈనేపథ్యాన వంగిన స్తంభాలు, వేలాడిన తీగలు సరిచేయడం వంటి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. రఘునాథపాలెం కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ నంబూరి రామారావు, ఏడీఈ ఎం.సంజీవకుమార్, ఏఈ పి.సతీష్, తదితరులు పాల్గొనగా, నేలకొండపల్లి కార్యక్రమంలో ఏడీఈ కోక్యా నాయక్, రాజేశ్వరపురం ఏఈ నారాయణరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దండా నరసింహారావు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలని వినతి

ఖమ్మంక్రైం: జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్‌లాంటి మాదక ద్రవ్యాలను అరికట్టాలని సీపీ సునీల్‌దత్‌కు శనివారం పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. గంజాయితో పాటు 24గంటల పాటు మద్యం విక్రయిస్తున్నారని, అలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలని అందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీపీని కోరారు. నగరంలో పలు ప్రాంతాల్లో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై తిరుగుతున్నారని దీనికి వెంటనే చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు ఝాన్సీ, శోభ, భరత్, సురేష్, మంగతాయరు, మామిడాల వెంకటేశ్వర్లు, గండికోట లక్ష్మణ్, మాక్కా రవీందర్, రెడ్డబోయిన మమత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

సాహసం చేయాల్సిందే..!



మండలంలోని రాజేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే చోట ఉన్నాయి. అయితే ఏ చిన్నపాటి వర్షం వచ్చినా.. పాఠశాల ఆవరణమంతా బురద నీటితో చెరువును తలపిస్తోంది. వీటిని దాటితేనే ఆయా కేంద్రాలకు వెళ్లేది. ప్రతీ రోజు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇదిగో ఇలా సాహసించి దాటాల్సి వస్తోంది. ఈక్రమంలో జారిపడితే ఇక అంతే సంగతి. అంతేకాక ఇది ఇలాగే ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి వరద నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- నేలకొండపల్లి

నేడు విద్యాశాఖపై మంత్రి సమీక్ష

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం వన్‌టౌన్: కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం విద్యాశాఖపై సమీక్షించనున్నారు. పాలేరు నియోజకవర్గంలోని మండలాల ఎంఈఓలు, హైస్కూళ్ల హెచ్‌ఎంలతో మంత్రి మధ్యాహ్నం 2–30 గంటలకు సమావేశమవుతారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. విద్యార్థుల నమోదు, హాజరు, బోధన, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన పనులపై మంత్రి సమీక్షిస్తారని పేర్కొన్నారు. అనంతరం కూసుమంచి, ఖమ్మంలో జరిగే ప్రైవేట్ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు.

మంత్రి పొంగులేటి సంతాపం

ఖమ్మంవన్‌టౌన్: ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తల్లి పద్మావతి మృతికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

పీహెచ్ వర్కర్ మృతికి..

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తున్న నగరంలోని రేవతిసెంటర్‌కు చెందిన సవరం వెంకటేశ్వర్లు శనివారం మృతి చెందగా.. మేయర్ పునుకొల్లు నీరజ నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్పొరేటర్ కమర్తపు మురళి సైతం నివాళులర్పించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామానికి చెందిన పి.సురేందర్ (35) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు కావడంతో పెద్ద కూతురైన జ్ఞానేశ్వరి తలకొరివి పెట్టింది. మృతుడికి భార్య, కుమార్తెలు ఉన్నారు.

నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: జస్టిస్ శివశంకర్ 95వ జయంతిని మున్నూరు కాపు పెద్దలు శనివారం ఖమ్మంలో ట్రస్టుబోర్డు చైర్మన్ మేకల భిక్షమయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, కార్యదర్శి శెట్టి రంగారావు, జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. విజయ్‌కుమార్, నర్సయ్య, హనుమంతరావు, పూర్ణచందర్‌రావు, మోహన్‌రావు, నాగరాజు, సోమయ్య, రామారావు, వెంకట్, నర్సయ్య, మల్లికార్జున్ రవి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం



సమావేశంలో మాట్లాడుతున్న అసద్

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లు కేవలం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకమని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం మైనార్టీ నాయకుడు, జేఐహెచ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇలియాస్, ప్రముఖ విద్యావేత్త, న్యాయ నిపుణుడు ఎండీ అసద్, మూవ్‌మెంట్ ఫర్ జస్టిస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం, ఆబిద్ అలీ, ఎండీ అజీమ్, ఎహసాన్, జాకీర్ అన్నారు. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ తమకు ఇంకా భారీ మెజార్టీ ఉందనే భ్రమలోనే ఉందని, అందుకే ప్రజా వ్యతిరేక హిందు – ముస్లింల పాచికలు వేసే అలవాటులో భాగంగా ఈ వక్ఫ్ బిల్లు ప్రవేశపెట్టి దుస్సాహసానికి పాల్పడిందని వారు విమర్శించారు. ఇకనైనా ప్రజారంజక విధానాల ద్వారా ప్రజలకు పనికొచ్చే బిల్లులను ప్రవేశపెట్టాలని వారు సూచించారు. నైజాం నవాబులు, కాకతీయ రాజులు ఇలా దేవాలయాలకు, మసీదులకు, దర్గాలకు భూములను దేవుడి పేరు మీద వితరణ చేశారని, అలాంటి భూముల్లో ప్రభుత్వం తలదూర్చడం తగదన్నారు. వక్ఫ్ భూముల కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బడ్జెట్‌ను సవరించాలని సీఐటీయూ నిరసన



బారుగూడెంలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని సీఐటీయూ ఆధ్వర్యాన మండలంలోని ఆరెంపుల, బారుగూడెం, చింతపల్లి, కొండాపురంలలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఐసీడీఎస్‌కు, వైద్యరంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మేందర్, వీరబాబు, సుజాత, సరిత భాగ్యమ్మ, తిరపమ్మ, భారతి, బ్రహ్మాచారి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

తిరుమలాయపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, బియ్యం, బెల్లం అక్రమ రవాణాకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని, పేకాట ఆడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం మత్తులో ఈవ్‌టీజింగ్ పేరుతో విద్యార్థినిలు, మహిళలను వేధించరాదని, గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కానిస్టేబుళ్లు వీరస్వామి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు రాంచందర్‌రావు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా, కోశాధికారిగా సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించిన డీఎస్ రాంచందర్‌రావు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. రాంచందర్‌రావు శనివారం మృతి చెందగా ఆయన సంతాప సభను స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సభకు ముందు రాంచందర్‌రావు చిత్ర పటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాక మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, మహ్మద్ సలాం, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్‌లతో పాటు గాదె లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మమత ఆస్పత్రి ఆధ్వర్యాన మెడికల్ క్యాంప్



మందులు అందజేస్తున్న వైద్యులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మమత జనరల్ ఆస్పత్రి అధ్వర్యాన మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ వ్యాధులు, ఎముకల సమస్యలతో బాధపడే వారిని, చిన్న పిల్లలను వైద్యులు పరీక్షించారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి దాదాపు 200 మందికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ క్యాంప్‌నకు మంచుకొండ పీహెచ్‌సీ సిబ్బంది సహాయ సహకారాలు అందించగా.. ఆస్పత్రి వైద్యులు క్రాంతి కిరణ్, పూజ, శరత్ సాయి, నిశాంత్, క్యాంప్ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌లతో పాటు పీహెచ్‌సీ పర్యవేక్షకుడు తాళ్లూరి శ్రీకాంత్, సహాయకులు మేడా పుష్పావతి, కృష్ణయ్య, కార్యదర్శి సుజాత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘హార్వెస్ట్’లో ఇంటర్‌హౌస్ పోటీలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో గత వారం రోజులుగా వివిధ అంశాలపై ఇంటర్ హౌస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. శనివారం ఫేస్ మాస్కింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు.

‘గ్లోబల్ విస్తా’లో అవగాహన

ఖమ్మం అర్బన్: నగరంలోని పుట్టకోటరోడ్‌లో గల శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలలో ఫ్యూచర్ పాత్‌వేస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, మేథో ఉచ్ఛకతను ప్రేరేపించటం ద్వారా అంతర్గత క్రమశిక్షణ జ్ఞానం, అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాయి గీతిక, డీజీఎం చేతన్ మాదూర్, ప్రిన్సిపాళ్లు జయసుధ, టీఎల్ఎన్ శర్మ, నాగప్రవీణ, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అపరిశుభ్రంగా కొత్త బస్టాండ్..!





ఖమ్మం కొత్త బస్టాండ్‌లో దుకాణదారులు, క్యాంటీన్ నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వీరు క్యాంటీన్‌లో వంటల కోసం వాడిన నూనె ప్యాకెట్లు, తాగి పడేసిన టీ కప్పులను క్యాంటీన్ వెనుక భాగంలో ఇష్టారీతిన పడేస్తుండడంతో అపరిశుభ్రంగా తయారవుతోంది. అంతేకాక గ్యాస్ సిలిండర్‌లకు కేటాయించిన స్థలం కంటే ఎక్కువ స్థలం వినియోగిస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. వారికి అధికారులు వత్తాసు పలుకుతుండగా.. స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై స్టేషన్ మేనేజర్‌ను వివరణ కోరగా.. వారు డిపో మేనేజర్ అనుమతితోనే వారు బస్టాండ్ ప్రాంగణాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. - ఖమ్మంమయూరిసెంటర్